


ఆక్రమణలకు ఎత్తు'గోడ'

ప్రభుత్వ భవనాల ఆక్రమణకు ఓ ప్రబుద్ధుడు ఎత్తు'గోడ' వేశాడు. ఆర్‌బీకేలనూ వదలకుండా ఆక్రమిస్తున్నాడు. - 8లో



తండ్రిని కోల్పోయి..

ఇద్దరు పిల్లలు బతకడానికి ఇబ్బంది పడుతున్నారు. తండ్రిని కోల్పోయారు. తల్లి ఆస్పత్రిలో ఉన్నారు. - 8లో



న్యూస్‌రీల్

ఏప్రిల్ 7 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏప్రిల్ 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అండర్ గ్రాడ్యుయేషన్ ఇన్‌చార్జి ఎగ్జామినేషన్స్ డీన్ పి.పద్మారావు మంగళవారం తెలిపారు. జిల్లాలో 64 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 7221 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పేర్కొన్నారు. సజావుగా పరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అనుమతులకు వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచొద్దని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కార్యాలయ సమావేశ మందిరంలో పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహంపై సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన జూమ్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్ డెస్క్ విండోకు సంబంధించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయని జీఎంను అడిగారు. 15 దరఖాస్తులు రాగా 13 ప్రాసెస్‌లో ఉన్నట్లు జీఎం విజయరత్నం చెప్పారు. పీఎంఈజీపీలో 69 లక్ష్యం కాగా 90 మంజూరు చేశామని ఇందుకు రూ.4.39 కోట్లు మంజూరు చేసినట్లు జీఎం తెలిపారు.

ఏప్రిల్ 13 న జిల్లాస్థాయి మేధా సమ్మాన్ పరీక్ష



మాట్లాడుతున్న అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి

కవిటి: జిల్లాలోని అన్ని ఒడియా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏప్రిల్ 13న ఆంధ్రప్రదేశ్ ఒడియా టీచర్స్ అసోసియేషన్(అపోటా) ఆధ్వర్యంలో మేధా సమ్మాన్ ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నట్లు అపోటా ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి తెలిపారు. మంగళవారం సహలాలపుట్టుగ పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు ఆయన వివరాల్ని వెల్లడించారు. ఈ నెల 25 లోగా ఏ పాఠశాల నుంచి ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటున్నారన్న సమాచారాన్ని ఆయా మండలాల అపోటా అధ్యక్ష,కార్యదర్శులకు నివేదించాలన్నారు. ఐదో తరగతి చదువుతున్న వారు ప్రతి పాఠశాల నుంచి 5 మందికి మించకుండా బాలబాలికలు పాల్గొనే అవకాశం ఉందన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కవిటి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన 35 ఏళ్ల వ్యక్తిపై కవిటి పోలీసులు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నంనాయుడు మంగళవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ బాలికపై ఈ వ్యక్తి లైంగికదాడికి పాల్పడినట్లు తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ప్రాథమికంగా విచారణ చేశారు. ఈ వ్యక్తి ఈ నెల 11న బాలికతో అసభ్యంగా ప్రవర్తించినట్లు గుర్తించారు. మళ్లీ 14వ తేదీన కూడా అలాగే ప్రవర్తించినట్లు గ్రామంలో జరిపిన విచారణలో గుర్తించామని పోలీసులు తెలిపారు. పూర్తిస్థాయి విచారణను కాశీబుగ్గ రేంజి డీఎస్పీ కె.వెంకట అప్పారావు పర్యవేక్షణలో చేపడుతున్నామని చిన్నంనాయుడు తెలిపారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించామన్నారు.

రిమ్స్‌లో అత్యవసర సమాచార సేకరణకు ఫోన్ నంబర్



మాట్లాడుతున్న డాక్టర్ పార్వతి

శ్రీకాకుళం: శ్రీకాకుళం సర్వజన ప్రభుత్వ ఆస్పత్రి, ప్రసూతి విభాగంలో అత్యవసర సమాచార సేకరణ కోసం ఓ నూతన కార్యక్రమాన్ని ప్రారంభించామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలమురళీ కృష్ణ అన్నారు. రిమ్స్‌లో ప్రసూతి విభాగాధిపతి డాక్టర్ డి.పార్వతి ఆధ్వర్యంలో డీఎంహెచ్‌ఓ, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం చేతుల మీదుగా మంగళవారం మొబైల్ నంబర్ ఓపెన్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పార్వతి మాట్లాడుతూ.. ప్రసూతి విభాగంలో అత్యవసర సేవలకు ఈ ఫోన్ నంబర్ వాడుకోవచ్చన్నారు. ఫోన్ నంబర్‌ను డీఎంహెచ్‌ఓ కార్యాలయం ద్వారా అన్ని పీహెచ్‌సీలకు అందిస్తామని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కల్యాణ్ బాబు తెలిపారు.



స్థానిక సంస్థల ప్రతినిధులను డమ్మీలుగా మార్చేశారు.. టెండర్లు పిలవకుండానే పనులు కట్టబెడుతున్నారు.. వెండర్స్ ముసుగులో సొంత పార్టీ కార్యకర్తలకు ప్రజాధనం దోచి పెడుతున్నారు.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గౌరవిస్తామని చెప్పి.. వారికి అధికారమన్నదే లేకుండా చేస్తున్నారు.. వెరసి కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేస్తున్నారు. దీంతో తమ హక్కులు, గౌరవం కోసం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పోరాడాల్సి వస్తోంది.

అధికార పార్టీ అక్రమాలపై సంగ్రామ భేరి

- కూటమి ప్రభుత్వం తీరుపై స్థానిక సంస్థల ప్రతినిధుల నిరసన
- అడ్డగోలుగా మెటీరియల్ కాంపోనెంట్ పనుల కేటాయింపు
- రాజ్యాంగానికి తూట్లు పొడిచిన పాలకులు
- వెండర్స్ ముసుగులో రూ. 700కోట్ల మేర టీడీపీ నేతలకు పంపకాలు
- టెండర్లు పిలవకుండానే పనుల అప్పగింత

వెండర్ల ముసుగులో నిధులకు సర్కార్ టెండర్



హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల హక్కులకు భంగం కలగకుండా చూడాలని గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతాడ రవికుమార్ తదితరులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వం స్థానిక నేతలను అవమానిస్తోంది. వారితో పని లేదన్నట్టు వ్యవహరిస్తోంది. దీంతో స్థానిక సంస్థల నాయకులు స్థానికంగా ఆందోళనలతో మొదలుపెట్టి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. 2014–19 సమయంలో టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, ఆ సభ్యులతోనే పనులన్నీ చేయించింది. ఇప్పుడా జన్మభూమి కమిటీ స్థానంలో వెండర్స్ అనే కొత్త పేరుతో టీడీపీ నాయకులను రంగంలోకి దించింది. ముందుగా గ్రామాల వారీగా వెండర్స్‌గా ఆ పార్టీ నాయకుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసి, ఆ వెండర్స్ రూపంలో ఉన్న నాయకులతో గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులను చేయిస్తోంది. ఆ మధ్య రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి గ్రామసభలు పెట్టి రికార్డు సృష్టించామని ప్రజల్ని మభ్యపెట్టిన కూటమి ప్రభుత్వం.. ఆ రోజు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో తీర్మానాలు చేసి, పని అయ్యాక వారందరినీ పక్కన పెట్టేసి వెండర్స్ ముసుగులో టీడీపీ నాయకులకు ఏకపక్షంగా పనులు కట్టబెట్టేసింది. వాస్తవంగా మెటీరియల్‌ను సరఫరా చేసేవాళ్లని వెండర్స్ అంటారు. కానీ, కూటమి ప్రభుత్వం దానికి కొత్త భాష్యం చెప్పింది. వెండర్స్ అంటే కాంట్రాక్టర్స్ అన్నట్టుగా పనులు చేయించుకునిపోతోంది.

చట్టంతో మాకేంటి పని..!

రాజ్యాంగంలో పేర్కొన్న ప్రకారం పంచాయతీలో చేపట్టే పనులను ఆయా పాలకవర్గాలే చేపట్టాలి. ముఖ్యంగా పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 16లో 5వ ఉప అంశం ప్రకారం గ్రామ పంచాయతీ వెచ్చించే నిధుల్లో 50శాతం పనులు పంచాయతీల ద్వారా చేపట్టాలి. కానీ అందుకు భిన్నంగా ఇక్కడ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి వెండర్స్‌తో పనులు చేయిస్తున్నారు. గ్రామ పంచాయతీలతో సంబంధం లేకుండా ఎంపీడీఓలు డైరెక్ట్‌గా వెండర్స్ రిజిస్ట్రేషన్ చేయించి, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేయిస్తున్నారు. అలాగే పంచాయతీ తీర్మానం లేకుండా చేపట్టే పనులకు చట్టబద్ధత కూడా ఉండదు. కానీ, కూటమి ప్రభుత్వంలో అదేమీ పాటించడం లేదు. జిల్లాలో పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, సమగ్ర శిక్ష అభియాన్, రోడ్లు భవనాల శాఖల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో పనులకు శ్రీకారం చుట్టింది. వాస్తవంగా ఈ నిధులేమీ రాష్ట్ర ప్రభుత్వానివి కావు. ఉపాధి హామీ పథకం కింద వచ్చిన నిధుల్లో 60శాతం వేతనాల రూపంలో ఖర్చు పెట్టాల్సి ఉండగా, మిగతా 40శాతం నిధులను మెటీరియల్ కాంపోనెంట్ కింద నిర్దేశిత అభివృద్ధి పనులు చేపట్టాలి. అంటే కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, తదితర ఇంజినీరింగ్ పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద వచ్చిన నిధుల్లో 40శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ. 699.57కోట్లతో 5310పనులు మంజూరు చేసింది. ఇవన్నీ పంచాయతీల తీర్మానాల ద్వారా, పాలక వర్గాలు చేపట్టాలి.

నేతలకు పంచి పెట్టిన పనులు..

నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీలతో చేపట్టాల్సిన పనులను టీడీపీ నేతలకు పప్పుబెల్లాల్లా పంచిపెట్టేసింది. టెండర్లు పిలిచి, పనులు చేయించాల్సి ఉండగా.. అందుకు భిన్నంగా ఆ పార్టీ నాయకులకు వెండర్స్ ముసుగులో ఏకపక్షంగా కేటాయించేసింది.

పర్యవేక్షక అధికారులు కూడా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో రూ. 183 కోట్ల పనులు చేసేసినట్టు రికార్డుల్లో చూపించేశారు.

● ఎందుకింత అడ్డగోలు తనం...

సాధారణంగా పంచాయతీల్లో ఏ పనులు చేపట్టినా సర్పంచ్‌ల నేతృత్వంలో పంచాయతీ కార్యవర్గం ఆధ్వర్యంలో జరగాలి. మండల పరిషత్ నిధులతో చేపట్టే పనులు ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో జరుగుతాయి. పంచాయతీల తీర్మానంతోనే ఏదైనా జరగాలి. కానీ, ప్రస్తుతం తీర్మానాల వరకే సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీలని, పనులు వచ్చేసరికి తమ పార్టీలకు చెందిన నాయకులకేనని చెప్పేస్తున్నారు. సర్పంచ్‌లు కేవలం తీర్మానాలకే పరిమితమని తెగేసి చెప్పేస్తున్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఉన్నట్టుగా ఇప్పుడు వెండర్ పేరుతో గ్రామస్థాయిలో కొంతమంది టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ఎంపిక చేసి, వారి పేర్లనే జిల్లా జల యాజమాన్య సంస్థ(డ్వామా)లో రిజిస్ట్రేషన్ చేసి, వారికే గ్రామస్థాయి పనులు కాంట్రాక్ట్ అప్పగించి, వారి పేరున బిల్లులు మంజూరు చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. వెండర్స్ పేరుతో కూటమి నాయకుల పేర్లు శిలాఫలకాల్లోనూ వేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న వారిని మాత్రం విస్మరిస్తున్నారు.



స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను డమ్మీ చేసి, అడ్డగోలుగా వ్యవహరిస్తున్న తీరుపై నిలదీస్తున్న నందిగాం మండల ప్రజాప్రతినిధులు

● నిరసనలు.. నిలదీతలు..

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను డమ్మీ చేసి పచ్చ చొక్కాలు వేసుకున్న నాయకులకు పనులు అప్పగించడంపై నాయకులు మండిపడుతున్నారు. సభలు, సమావేశాల్లో గట్టిగా నిలదీస్తున్నారు. పంచాయతీ సమావేశాలను బహిష్కరిస్తున్నారు. మండల పరిషత్ సమావేశాలను వాకౌట్ చేస్తున్నారు. ఎక్కడికక్కడ అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి, నిరసనలు కూడా చేస్తున్నారు.. ఎన్ని చేసినా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రాజ్యాంగానికి విరుద్ధంగా, పంచాయతీరాజ్ చట్టాలకు భిన్నంగా ప్రభుత్వం అనుసరించిన తీరుపై ఉమ్మడి జిల్లాలోని లక్ష్మీపురం, మునకలవలస, గుల్లపాడు తదితర పంచాయతీలు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు కూడా ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న పనుల్లో కనీసం 50శాతానికి తక్కువగా కాకుండా పనులు గ్రామ పంచాయతీల ద్వారా చేపట్టాలని తీర్పు ఇచ్చింది. అయినప్పటికీ తీర్పులు పట్టించుకోకుండా టీడీపీ నాయకులు, కార్యకర్తల జేబులు నింపేందుకు కూటమి ప్రభుత్వం అడ్డదారిలోనే వెళ్తోంది. కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా తానొక ప్రత్యేకమని చెప్పుకుంటున్న పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖలో జరుగుతున్న అప్రజాస్వామిక విధానమేంటో కళ్లకు కట్టినట్టు స్పష్టమవుతోంది. కానీ దీనిపై తీసుకున్న చర్యలు మాత్రం శూన్యం.



హక్కులు కాలరాసి, రాజ్యాంగాన్ని తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం తీరుకు నిరసనగా ఇటీవల నందిగాం మండల పరిషత్ సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోతున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు

పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పెండింగ్ ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులు, రీసర్వే ఫిర్యాదులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ల్యాండ్ బ్యాంక్, కోర్టు కేసులు, వక్ఫ్ ఆస్తుల సర్వే వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. 'పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయండి, పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది' అని కలెక్టర్ హామీ ఇచ్చారు. సాంఘిక సంక్షేమ శాఖపై సమీక్షించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్‌పై ప్రచారం, ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణమూర్తికి సూచించారు. సమీక్షకు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా, సీపీఓ ప్రసన్న లక్ష్మి, టెక్కలి ఆర్డీవో కృష్ణ మూర్తి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ, డ్వామా పీడీ సుధాకర్, హౌసింగ్ పీడీ నగేష్, జిల్లాలోని ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరయ్యారు.

వివిధ రాజకీయ పార్టీలతో డీఆర్‌ఓ సమావేశం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని వివిధ రాజకీయ పార్టీలతో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి అధికారుల నియామకాలు, పోలింగ్ బూత్‌లకు సంబంధించి అంశాలపై చర్చించి పోలింగ్ కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు, తదితర వాటిపై సమీక్షించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలు, సలహాలను ఆయన స్వీకరించారు. ఈ సమావేశంలో టీడీపీ నుంచి పి.యం.జె బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌదరి తేజేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నుంచి ఆర్. శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ పోలీసులకు చుక్కెదురు



ఒడిశాలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణతో పాటు 8 మంది సిబ్బంది, 2 వాహనాలను చుట్టుముట్టిన స్థానికులు

కాశీబుగ్గ: పేకాట రాయుళ్లను పట్టుకోవడానికి వెళ్లి పొరపాటున ఒడిశా భూభాగంలోకి వెళ్లిన కాశీబుగ్గ పోలీసులకు చుక్కెదురైంది. ఆంధ్రా-ఒడిషా సరిహద్దులో జూదం ఆడుతున్నారన్న సమాచారం మేరకు కాశీబుగ్గ పోలీసులు ఒడిశా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సోమవారం అర్ధరాత్రి వేళ రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లడం వివాదాస్పదమైంది. పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వాహనాలలో ఎక్కించి తరలించగా స్థానికులు అడ్డుకున్నారు. గజపతి జిల్లా ఎస్పీకి కాశీబుగ్గ పోలీసులపై ఫిర్యాదు చేశారు. ఈ తరుణంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ బృందంతో పాటు రెండు వాహనాలను ఒడిశా సరిహద్దులో గురండి పోలీసుస్టేషన్ సమీపంలో స్థానికులు అడ్డుకున్నారు.

చదును.. ఇదే అదును!



కవిటిలో చదును చేసిన ప్రభుత్వ భూమి ఇదే

ప్రభుత్వ భూమిపై టీడీపీ నేత కన్ను

- కవిటి-రాజపురం రోడ్డుపక్కన స్థలాన్ని జేసీబీతో చదును చేయించిన వైనం
- స్థలాన్ని పరిరక్షించాలని కోరుతున్న స్థానిక రైతులు

కవిటి :

మండల కేంద్రం కవిటిలో ప్రభుత్వ భూమిని కవిటి పట్టణ టీడీపీ అధ్యక్షుడు వజ్జ రంగారావు భారీ ఖర్చుతో చదును చేయించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. చదును పేరిట స్థలాన్ని ఆక్రమించుకునేందుకే ఇటువంటి పనులు చేస్తున్నారని పరిసర ప్రాంత రైతులు చెబుతున్నారు. కవిటి నుంచి రాజపురం వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన రంగారావుకు కొబ్బరి తోట ఉంది. రోడ్డుకు, తోటకు మధ్య కొంత ప్రభుత్వ స్థలం కూడా ఉంది. ఈ స్థలంలో ఇటీవల ట్రాక్టర్‌తో మట్టి లోడ్లు లేశారు. మట్టి వేయడం జేసీబీతో వేసిన చదును చేయడం ఏకకాలంలో చేపట్టారు. ట్రాక్టర్ వెళ్లడానికి స్థలాన్ని చదును చేయిస్తున్నానని చెబుతున్నా స్థలం అంతటినీ చదును చేయిస్తుండడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ తోటకే వెళ్లేందుకు మార్గాన్ని సిద్ధం చేసుకోవాలంటే అంత ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అంత భారీ మొత్తం ఖర్చు పెట్టి చదును చేయాల్సిన అవసరం ఏముంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అనుమతి లేకుండానే..

ప్రభుత్వ స్థలం చదును చేయించాలంటే అధికారుల ఆమోదం పొందాలి. సుమారు 40 సెంట్ల వరకు అక్కడ స్థలం ఉందని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇక్కడే విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేశారు. అప్పట్లో రంగారావు అభ్యంతరం తెలపడంతో ఆ ప్రయత్నాన్ని మార్చుకున్నారు. ఇప్పుడు స్థలం చదును చేయించడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. కూటమి ప్రభుత్వ అధికారాన్ని, స్థానికంగా ఉన్న ప్రభుత్వ విప్ బి.అశోక్ అండదండలతోనే ఇదంతా జరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు, ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించాం..

స్థలం చదును విషయం మా దృష్టికి వచ్చిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లాం. తన తోటకు వెళ్లడానికే మాత్రమే స్థలాన్ని చదును చేయిస్తున్నానని, ఆక్రమణకు కాదని రంగారావు చెప్పారు. ఒకవేళ స్తంభాలు వంటివి పాతితే శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– ఎస్.నారాయణ, వీఆర్‌ఓ



కట్టుకున్నవాడే కాలయముడు

- భర్త చేతిలో భార్య హతం
- మద్యం మత్తులో హత్య
- ఎచ్చెర్ల మండలం సంతసీతారాంపురంలో ఘటన



భర్త అప్పలరెడ్డితో నాగమ్మ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురంలో గాలి నాగమ్మ(42) అనే మహిళను ఆమె భర్త అప్పలరెడ్డి సోమవారం రాత్రి దారుణంగా నరికి చంపేశాడు. ఈ హత్య స్థానికంగా సంచలనం రేకెత్తించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

అప్పలరెడ్డి, నాగమ్మ దంపతులకు ఇద్దరు బిడ్డలు. రెండేళ్ల కిందటే అమ్మాయికి పెళ్లి చేశారు. కొడుకు త్రినాథరావుతో కలిసి విశాఖలో ఉండేవారు. త్రినాథరావు తాపీమేస్త్రీ కాగా.. తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులుగా పనిచేసేవారు. కుటుంబం మొత్తం కష్టాన్నే నమ్ముకుని బతికేది. గత నెలే వీరు స్వగ్రామం సంతసీతారాంపురం వచ్చేశారు. ఇక్కడ సొంతిల్లు ఉండడంతో కుమారుడికి పెళ్లి చేసి మళ్లీ విశాఖ వెళ్లిపోవాలని అనుకునేవారు. స్థానికంగా ఉండటంతో సరుగుడు, నీలగిరి చెట్లు కొట్టటం, తొక్క తీయటం వంటి పనులు చేస్తున్నారు.

సోమవారం కూడా రణస్థలంలో నీలగిరి తోట కొట్టేందుకు, తొక్క తీసే పనికి భార్యాభర్తలు వెళ్లారు. సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. రాత్రి భోజనం చేశారు. కుమారుడు ఇంటి బయట మంచం వేసుకొని పడుకున్నారు. రాత్రి దంపతుల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. అప్పలరెడ్డికి మద్యం తాగే అలవాటు ఉంది. దీంతో మందు తాగి గొడవపడడం, భార్యను అనుమానించడం వంటి పనులు చేసేవాడు. రాత్రి కూడా ఇలాగే దంపతులిద్దరూ గొడవ పడ్డారు. అయితే రాత్రి పది గంటల సమయంలో ఒక్కసారిగా సరుగుడు, నీలగిరి చెట్లు నరికే కత్తితో ఆమెపై దాడికి తెగబడ్డాడు. మద్యం మత్తులో అతి కిరాతకంగా కత్తితో మెడ, తలపై దాడి చేశాడు. నాగమ్మ పెద్దగా కేకలు వేయడంతో కుమారుడు, చుట్టుపక్కల వారు కంగారు పడి ఇంటిలోకి వెళ్లబోతుండగా.. అప్పలరెడ్డి తలుపులు తీసి బయటకు వెళ్లిపోయాడు. లోపల చూస్తే నాగమ్మ విగతజీవిగా పడి ఉంది.

హత్య చేసిన వ్యక్తి అర్ధరాత్రి సమయంలో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్, క్లూస్ టీమ్ సంఘటన స్థలాన్ని సందర్శించింది. కుమారుడు త్రినాథరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాగమ్మ మృతదేహానికి శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మంగళవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ హత్యతో గ్రామమంతా విషాదం నెలకొంది. జేఆర్ పురం సీఐ అవతారం కేసు దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటన స్థలంలో సాక్ష్యాలు సేకరిస్తున్న క్లూస్ టీం

క్లుప్తంగా

ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఎచ్చెర్లలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా గ్రామీణ యువత కోసం సీసీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో 13 రోజుల ఉచిత శిక్షణను ఈ నెల 28 నుంచి ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తామని, పూర్తి వివరాలకు 9553410809, 7993340407 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

టీడీపీ నేతపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఈకి వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులు

అరసవల్లి: పెద్దపాడు సమీపంలో ఈ నెల 12న విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావుపై దాడికి పాల్పడిన స్థానిక టీడీపీ నేత కలగ శ్రీనివాసరావుపై ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని.. ఇంకో మూడు రోజుల్లో దీనిపై తేల్చకపోతే భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతామని విద్యుత్ కార్మిక సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తిని మంగళవారం పలువురు కార్మిక ఉద్యోగ సంఘ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. దాడి చేయడమే కాకుండా మిగిలిన వారిపై పరుష పదజాలంతో దూషించినా పోలీసులు ఇంతవరకు చర్యలు చేపట్టలేదన్నారు. ఇలాగైతే విధులు నిర్వర్తించడం కష్టమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ఎస్ఈ తదితర ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్ఈని కలిసిన వారిలో ఎం.ప్రభాకరరావు, టి.వి.సుబ్రహ్మణ్యం (1104), కె.వైకుంఠం (తెలుగునాడు), సీహెచ్ పాపారావు (327), బి.గురునాథరావు (బహుజన) , విద్యుత్ కార్మిక యూనియన్ నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల ఖాతాల నిర్వహణ ఆన్‌లైన్ చేయాలని వెలుగు సంస్థ సంస్థాగత నిర్మాణం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్లలోని జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, కొత్తూరు, ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి మండలాల ఏసీ, ఎల్ఎస్, ఏపీఎం, సీసీ, వీవోఏలకు లోకోస్ సాఫ్ట్‌వేర్, ఆన్‌లైన్ ఖాతాల నిర్వహణపై మంగళవారం శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ మార్గదర్శకాలను అనుగుణంగా స్వయం సహాయ సంఘాలు విజయవంతంగా ముందుకు సాగాలన్నారు. గ్రామైక్య, మండల సమాఖ్య, జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో ఖాతాల నిర్వహణ పక్కాగా ఉండాలని చెప్పారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలత, అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వేళల్లో మార్పు



బి.శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్ : వేసవి దృష్ట్యా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల సమయవేళల్లో మార్పులు చేస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ మంగళవారం తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. మే 31వ తేదీ వరకూ ఈ వేళలు అమల్లో ఉంటాయన్నారు. ప్రీ స్కూల్ చిన్నారులకు వండిన ఆహారం అందించి వారి గృహాలకు పంపించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు గమనించాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
UMFB - శ్రీకాకుళం బ్రాంచ్, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం. ఫోన్ : 08942-226275. E-mail: ubin0805131@unionbankofindia.bank

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8 (1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB - శ్రీకాకుళం బ్రాంచ్ యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి సెక్షన్ 13(2)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో ఋణగ్రహీతలు/హామీదారులు: శ్రీ మామిడి విష్ణుమూర్తి, డి.నెం.4-1/6-4/3, పెద్ద రెల్లి వీధి, మున్సిపల్ స్కూల్ దగ్గర, శ్రీకాకుళం - 532001 & శ్రీ మామిడి రామి నాయుడు, డి.నెం.4-1/6-4/3, పెద్ద రెల్లి వీధి, మున్సిపల్ స్కూల్ దగ్గర, శ్రీకాకుళం - 532001 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ.14,74,324.88 పై (అక్షరాల పద్నాలుగు లక్షల డెబ్బై నాలుగు వేల మూడు వందల ఇరవై నాలుగు రూపాయల ఎనభై ఎనిమిది పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా తేది.30-12-2024న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

ఋణగ్రహీత అలాగే హామీదారులు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము తేది.13-03-2025న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనత తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి రూ.14,74,324.88 పై + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, UMFB - శ్రీకాకుళం బ్రాంచ్ వారి ఛార్జీకి లోబడి వుండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

స్థిరాస్తి వివరములు

శ్రీకాకుళం - 532001, శ్రీకాకుళం, ఆదివారంపేట, బలగ వార్డు, ఆర్.ఎస్.నెం.289/1 & 290, టి.ఎస్.నెం. 44/1 & 44/2 వద్ద 242.00 చగజాలు విస్తీర్ణం గల కమర్షియల్ ఖాళీ స్థలం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : శ్రీకాకుళం రోడ్డు, దక్షిణం : గొర్లు సోమేశ్వరి గారి ఖాళీ స్థలం, పడమర : తంగి అప్పయ్య, పేరయ్య & కింజరాపు సిమ్మన్న & ఇతరుల ఖాళీ స్థలం, ఉత్తరం : ఆర్. శివనారాయణ గారి ఖాళీ స్థలం.

తేది : 13-03-2025 సం/- అధీకృత అధికారి
స్థలం : శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రభుత్వ భవనాల ఆక్రమణకు ఎత్తు'గోడ'!

- పొన్నాంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాల కబ్జాకు స్కెచ్
- భవనాలకు గోడలు కట్టిస్తున్న విశ్రాంత వీఆర్‌ఓ
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన సర్పంచ్, గ్రామస్తులు
- పట్టించుకోని రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు



పొన్నాం ప్రధాన రహదారిలో నిర్మితమైన ప్రభుత్వ భవనాల్లో గోడలు కడుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని పొన్నాం పంచాయతీ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాల ఆక్రమణకు రంగం సిద్ధమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ విభాగం ద్వారా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో శ్లాబ్‌ల నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ భవనాలపై అదే గ్రామానికి చెందిన ఓ రిటైర్ట్ వీఆర్వో కన్నుపడింది. తనకున్న పలుబడి, కూటమి నాయకుల సహాయ సహకారాలతో వీటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రస్తుతం గోడలు సైతం కట్టేస్తున్నాడు.

ఇదీ పరిస్థితి..

పొన్నాం పంచాయతీ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ పోరంబోకు సర్వేనెంబర్ 287లో 65 సెంట్ల ప్రభుత్వ స్థలం ఉంది. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ స్థలం ప్రభుత్వ పోరంబోకుగానే ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు సైతం చూపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వెల్‌నెస్ సెంటర్‌కు రూ.17.50 లక్షలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ రెండు భవనాల నిర్మాణం శ్లాబ్ దశకు వచ్చి ఆగింది. భవన నిర్మాణం కొనసాగుతున్న కొద్ది రెండింటికి కలిపి ఇప్పటికి సుమారు రూ.20 లక్షల నిధులు కూడా ప్రభుత్వం విడుదలచేసింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక..

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భవనాలను అదే గ్రామానికి చెందిన ఓ రిటైర్డ్ వీఆర్వో తనకున్న పలుబడితో ఏకంగా వాటికి గోడలు కట్టేందుకు పూనుకున్నాడని అదే గ్రామానికి చెందిన దుడ్డు ముత్యాలనాయుడు, గొండు రమేష్, దుంగ సత్యం, గుండ రమేష్, తదితర గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భవనాల నిర్మాణం జరిగేటప్పుడు ప్రశ్నించని సదరు విశ్రాంత వీఆర్‌ఓ ప్రభుత్వం మారాక ఒక్కసారిగా శ్లాబ్ వేసిన బిల్డింగ్‌లకు నాలుగు వైపులా ఎలా గోడలు కడతారంటూ వారు ప్రశ్నిస్తున్నారు. పునాదులు తీసినప్పుడు గానీ, పిల్లర్లు వేసినపుడు గానీ ఆభూములకు ఎటువంటి కాగితాలు, పత్రాలు అప్పట్లో చూపని సదరు వ్యక్తికి ఇప్పటికిప్పుడు భూమి పత్రాలు ఎలా పుట్టుకొచ్చాయని వారు ప్రశ్నించారు.

వారిదే బాధ్యత..

ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న ఆ రెండు భవనాలను మాకు ఇంకా అప్పగించలేదు. నిర్మాణం చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులే ఆ భవనాలను చూసుకోవాలి. మాకు ఎటువంటి సంబంధం లేదు. ఈ వ్యవహారం కోర్టులో నడుస్తున్నట్లు తెలిసింది.

– బి.శైలజ, ఎంపీడీఓ, శ్రీకాకుళం

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాం

మా గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో ప్రభుత్వ భవనాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసాం. ప్రభుత్వ నిధులతో కట్టిన రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఎలా స్వాధీనం చేసుకుంటారు? ప్రజలకు అవసరమైన ప్రభుత్వ భవనాల కోసం మేం ఎందాకైనా వెళ్తాం.

– నీలంశెట్టి రామకృష్ణ, సర్పంచ్, పొన్నాం

హద్దులు తారుమారు

ప్రధాన రహదారిని ఆనుకుని విలువైన భూములను సైతం స్వాధీనం చేసుకునేందుకు సర్వే నంబర్‌లోని హద్దులు తారుమారు చేశారు. హద్దురాళ్లు సైతం మార్చేశారు. రెవెన్యూలో పనిచేసిన వారికే ఇటువంటి అనుభవాలు ఉంటాయి. రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– రావాడ మోహన్‌రావు, ఎంపీటీసీ, పొన్నాం

చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వ భవనాలను కబ్జాకు ప్రయత్నించిన రిటైర్డ్ వీఆర్వోపై తక్షణమే చర్యలు తీసుకోవాలి. రికార్డులను తారుమారు చేస్తూ ప్రభుత్వ ఆస్తుల స్వాధీనానికి ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవసమైన ఈ ప్రభుత్వ భవనాలు పూర్తయితే 11 వేల మంది రైతులు, 5 వేలు జనాభా గల పొన్నాం గ్రామస్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– బైరి అప్పారావు, రిటైర్డ్ టీచర్, పొన్నాం

తండ్రిని కోల్పోయి.. తల్లి ఆస్పత్రి పాలై..

- దిక్కుతోచని స్థితిలో ముగ్గురు బాలికలు
- సాయం చేయాలని వేడుకోలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరళ



దిక్కుతోచని స్థితిలో ముగ్గురు పిల్లలు

కాశీబుగ్గ : ఆ ముగ్గురు చిన్నారులు రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయారు. అదే ప్రమాదంలో తల్లి తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ఇప్పుడు ఆ చిన్నారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. తమకు దాతలు సాయం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ ప్రాంతంలో బుట్ట గంగాధర్, సరళ దంపతులు ముగ్గురు కుమార్తెలతో నివాసం ఉండేవారు. గంగాధర్ దివ్యాంగుడు. నిరుపేద కుటుంబం. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. చిన్న ఇల్లు తప్ప వేరే ఆస్తులు లేవు. పదిరోజుల క్రితం ఒడిశా రాష్ట్రం గండహతి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు లోయలో పడిపోయారు. గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య సరళకు కాలు, నడుము విరిగిపోయాయి. ఆస్పత్రిలో దిక్కుతోచని స్థితిలో ఉంది. వారి సంతానమైన ముగ్గురు బాలికలు అనాథలుగా మిగిలిపోయారు. దాతలు స్పందించి చిన్నారులకు చేదోడుగా నిలబడాలని అమ్మమ్మ జి.గౌరీ(8374708027) వేడుకుంటోంది.

ఆస్తి తగాదాలో మహిళపై దాడి



గాయపడిన రాజమ్మ వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని మలగాం పంచాయతీ దేపల్లివానిపేటలో ఆస్తి విషయమై మహిళపై దాడి జరిగింది. దీంతో ఆమె అపస్మారక స్థితికి చేరింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..ఎరుపల్లి కామమ్మ ఆధీనంలో ఉన్న ఆస్తిని ఆమె మరణానంతరం గ్రామానికి చెందిన ఎరుపల్లి లక్ష్మణరావు, అతని బంధువులు కబ్జా చేయడానికి మంగళవారం ప్రయత్నించారు. గొయ్యిలు తీసి సిమెంటు స్తంభాలను పాతి ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించగా కామమ్మ కుమార్తెలు దేపల్లి రాజమ్మ, నందుపల్లి సీతమ్మ అడ్డుకున్నారు. తమ స్థలంలో కంచె వేయడానికి మీరెవరని, ఏమైనా పత్రాలు ఉంటే గ్రామపెద్దలకు చూపించాలని కోరారు. పెళ్లయి అత్తారింటికి వెళ్లిపోయినా మీరు ఇక్కడికి వచ్చి అడగడం ఏంటంటూ ఎరుపల్లి లక్ష్మణరావు, పార్వతి, తాతయ్య లక్ష్మమ్మ, అప్పమ్మ, తదితరులు దాడి చేశారు. ఈ క్రమంలో రాజమ్మ స్తంభాలపై పడటంతో తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకుంది. వెంటనే బాధితురాలిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ యాజమాన్యం తీరు సరికాదు



కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో యాజమాన్యం ఎంప్లాయిస్ యూనియన్‌కే కొమ్ము కాయడం అన్యాయమని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూ జిల్లా సెక్రటరీ ఎంఎన్ రావు మాట్లాడుతూ యాజమాన్యం ఒక యూనియన్‌కే కొమ్ముకాస్తూ వారు ఎలా చెపితే అలా చేస్తున్నారని మండిపడ్డారు. ఒక కండక్టర్ వేరే డిపోలో పని చేస్తూ శ్రీకాకుళం -1 డిపోకి రిలీవింగ్ డ్యూటీకి వచ్చారని, వారి ఆర్డర్ ప్రకారం ఈ నెల 15వ తేదీ నాటికి కాలపరిమితి ముగిసిందన్నారు. అయినప్పటికీ అతనిని శ్రీకాకుళం 1వ డిపోలోనే కొనసాగిస్తూ కండక్టర్, డ్రైవర్ డ్యూటీ చార్ట్ కౌన్సిలింగ్‌లో అతనికి ప్రాధాన్యమిస్తూ సీనియారిటీ జాబితాలో పెట్టారని పేర్కొన్నారు. అతనికి, ఎంప్లాయిస్ యూనియన్‌కు ఆర్టీసీ యాజమాన్యం, డిపో యాజమాన్యం అన్ని విధాలా సహాయపడుతూ తమ ఎన్ఎంయూను చులకనగా చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే పంథా కొనసాగితే సహించేది లేదన్నారు. నిరసన కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు కె.నరసింహులు, నవీన్, ఎంఎస్ రాజు, కె.టి.రావు, వి.డి.రావు, ఆర్ఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.

బైక్ చోరులు అరెస్టు


శ్రీకాకుళం క్రైమ్ : అరసవల్లి మిల్లు జంక్షన్ సమీపంలోని 80 ఫీట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ఇద్దరు యువకులు మంగళవారం పోలీసులకు పట్టుబడ్డారు. ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక మొండేటివీధిలో నివాసముంటున్న దమర్సింగి అఖిల్ సాయి, ఎచ్చెర్ల మండలం ఎ.జి.పేటకు చెందిన భానుప్రసాద్ అలియాస్ పిలకడు అనుమానాస్పదంగా తిరుగుతుండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే ఒకటో పట్టణ ఎస్ఐకు సమాచారం అందించగా సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకుని విచారించగా ఐదు ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. తుప్పల్లో దాచిన బైక్‌లను తీసి చూపించారు. శ్రీకాకుళం రూరల్ పీఎస్‌లో రెండు, ఒకటో పట్టణ పీఎస్, రెండో పట్టణ పీఎస్, ఎచ్చెర్ల పీఎస్‌ల్లో ఒక్కోటి చొప్పున ఈ చోరీలు చేశారు. ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్/కాశీబుగ్గ: కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం గుర్తు తెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందినట్లు పలాస జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. సుమారు 55 ఏళ్ల వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుందని చెప్పారు. మృతదేహం గుర్తు పట్టని విధంగా మారిందని తెలిపారు. సమీప ప్రాంతాలలో ఎవరైనా వృద్ధుడు కనిపించకపోయినా, మృతిపై వివరాలు తెలిసినా 9440627567 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తుఫాన్‌లా వచ్చాడు.. పోలీసులకు దొరికిపోయాడు

- 21 కేజీల గంజాయితో తుఫాన్ అనే వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

ఇచ్ఛాపురం:

ఒడిశా రాష్ట్రం డెంకానాల్ జిల్లా నువా గ్రామానికి చెందిన తపన్ సమాల్ అలియాస్ తుఫాన్ అనే యువకుడు గంజాయితో పట్టుబడినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తుఫాన్‌కు గుంటూరులో ఓ డాబా వద్ద తమిళనాడుకి చెందిన ముతురాజ్, సుందర్‌రుధిర సమితో 'గంజాయి' పరిచయం ఏర్పడింది. రూ.15 వేలకు కేజీ గంజాయి ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో తన స్వగ్రామం సమీపంలోని గలపాడు నుంచి కేజీ రూ.7500 చొప్పున 21.040 కేజీల గంజాయిని కొనుగోలు చేశాడు. ఒడిశా నుంచి బస్సులో బయలుదేరి ఇచ్ఛాపురం మంగళవారం చేరుకున్నాడు. అనంతరం రైలు కోసం వెళ్తుండగా రత్తకన్న ఎల్‌సీ రైల్వే గేట్ వద్ద రూరల్ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ఓ యువకుడు..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని 80 ఫీట్ రోడ్డు సమీప ఏపీహెచ్‌బీ కాలనీ గ్రౌండ్‌లో రెండు కిలోల గంజాయితో ఓ యువకుడు పోలీసులకు పట్టుబడ్డాడు. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. తోటపాలెంకు చెందిన లొట్టి సురేష్ ఏపీహెచ్‌బీ కాలనీ గ్రౌండ్‌లో అనుమానాస్పదంగా తచ్చాడుతుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో పాటు వెళ్లి సురేష్‌ను అదుపులో తీసుకోగా అతని వద్ద రెండు కిలోల గంజాయి ప్యాకెట్ లభించింది. సీఐ పైడపునాయుడు ఈ ఘటనపై ఆరా తీశారు. అనంతరం సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ హరికృష్ణ తెలిపారు.

పోయిన గొలుసు తిరిగొచ్చింది

- అర తులం బంగారు గొలుసును పోగొట్టుకున్న ప్రయాణికురాలు
- తిరిగి అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు



మౌనికకు గొలుసు అందజేస్తున్న ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లు

శ్రీకాకుళం అర్బన్ : ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలు తన కుమార్తె మెడలో వేసిన అర తులం(6గ్రాములు) బంగారు గొలుసును పోగొట్టుకుంది. బస్సు డ్రైవర్, కండక్టర్లకు ఆ గొలుసు దొరకడంతో ప్రయాణికురాలికి తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. మంగళవారం పలాస డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఇచ్ఛాపురం నుంచి విశాఖ బయలుదేరింది. పలాస చేరుకున్న తర్వాత కొత్తపల్లి మౌనిక తన కుమార్తెను తీసుకుని శ్రీకాకుళం వెళ్లేందుకు బస్సు ఎక్కింది. గమ్యస్థానమైన శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో కుమార్తెతో సహా దిగిపోయింది. ఆ సమయంలో కుమార్తె మెడలో ఉన్న అర తులం బంగారు గొలుసును జారవిడుచుకుంది. ఈ విషయం గమనించని తల్లి, కుమార్తెలు బస్సు దిగి వెళ్లిపోయారు. ఇంతలో కండక్టర్ సీహెచ్ బెహరా, డ్రైవర్ పి.ఎస్.రావులకు ఆ గొలుసు దొరకడంతో స్టేషన్ మేనేజర్ ఎంపీ రావుకు అందజేశారు. కొద్దిసేపటి తర్వాత బంగారు గొలుసు పోగొట్టుకున్న మౌనిక బస్సు వద్దకు వచ్చి ప్రయాణికులకు చెప్పగా వారు కండక్టర్, డ్రైవర్లకు గొలుసు దొరికిందని, అధికారులకు అందజేయడానికి వెళ్లారని తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ అధికారులు, కండక్టర్, డ్రైవర్ సమక్షంలో గొలుసును మౌనికకు అందజేశారు. ఈ సందర్భంగా డ్రైవర్, కండక్టర్‌ను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఏడీసీ మొజ్జాడ హాటకేశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబాలను వెలివేయడం అనైతికం



పేరాడ తిలక్

టెక్కలి: మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలో అనైతికంగా కుటుంబాలను వెలివేసే సంఘటనలు జరగడం అప్రజాస్వామికమని వైఎస్సార్ సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. సంతబొమ్మాళి మండలం గెద్దలపాడులో ఆశా వర్కర్ కుటుంబంపై జరిగిన దుశ్చర్యను మంగళవారం తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రధానంగా టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు ప్రోద్బలంతా ఎంతోమంది చిన్న స్థాయి ఉద్యోగులను బెదిరించి వారితో బలవంతంగా రాజీనామాలు చేశారని, దీనికి గెద్దలపాడులో జరిగిన ఘటనే తార్కాణమని తిలక్ గుర్తు చేశారు. గ్రామాలను, పాఠశాలలను శుభ్రం చేసే గ్రీన్ అంబాసిడర్లు మొదలుకొని మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వెలుగు సిబ్బందిని బలవంతంగా తొలగించడమే కాకుండా కూటమి నాయకులంతా ఆయా ఉద్యోగాలను లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని దుయ్యబట్టారు. గెద్దలపాడు ఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. సామాజిక బహిష్కరణకు గురైన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించకపోవడం కేవలం ఆయా పార్టీ కార్యకర్తలు చేస్తున్న దౌర్జన్యాలకు అండగా నిలుస్తున్నారనే విషయం తేటతెల్లంగా మారిందన్నారు. శాంతిభద్రతలు పూర్తిగా వైఫల్యం చెందడంతో ఇటువంటి బెదిరింపులు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని మండిపడ్డారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యుత్ మీటర్ రీడర్లను ఆదుకోవాలి



పలాసలో నిరసన వ్యక్తం చేస్తున్న మీటర్ రీడర్లు

కాశీబుగ్గ: విద్యుత్ శాఖలో తీసుకొస్తున్న మార్పుల వల్ల సుమారు ఐదు వేల మీటర్ రీడర్ కుటుంబాలు రోడ్డున పడబోతున్నాయని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ పలాస డివిజన్ నాయకులు చాపర వేణుగోపాల్, జిల్లా మీటర్ రీడర్స్ అధ్యక్షుడు ఆర్.కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం మీటర్ల రీడర్లతో కలిసి పలాస విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా కేటీరోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 20 ఏళ్ల విద్యుత్ బిల్లులు తీస్తున్న సిబ్బంది పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, ఐఆర్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్ల బిగిస్తున్న నేపథ్యంలో జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి చూపించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం పలాస విద్యుత్ శాఖ డీఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మీటర్ రీడర్ల సంఘ జిల్లా కార్యదర్శి దూగాన భాస్కరరావు, పలాస డివిజన్ అధ్యక్షుడు బి.ఓంకార్, పలాస డివిజన్ కార్యదర్శి కె.నరేష్, సోంపేట, పలాస సబ్ డివిజన్ మీటర్ రీడర్లు పాల్గొన్నారు.

రెమ్యునరేషన్ పెంచాలని వినతి

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పరీక్షల నిర్వహణలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది పారితోషికం పెంచాలని ఏపీ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సప్పటి మల్లేసు, పంచాది గోవిందరాజులు, సహాధ్యక్షులు నెమలిపురి విష్ణుమూర్తి, జాయింట్ సెక్రటరీ కె.కె.రామిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షల రెమ్యునరేషన్‌ను రెండు వందల వరకు ఇస్తున్నారని.. పదో తరగతి పరీక్ష విధులకు మాత్రం చాలా తక్కువ మొత్తం చెల్లిస్తున్నారని గుర్తు చేశారు. రవాణా చార్జీలకు కూడా సరిపోని విధంగా ఉన్న రెమ్యూనరేషన్ మొత్తాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వం కేటాయించిన విధంగా పదో తరగతి పరీక్షలకు బడ్జెట్ కేటాయింపులు జరగాలన్నారు. దూరంతో సంబంధం లేకుండా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టమెంట్ ఆఫీసర్లు, కారు కస్టోడియన్లు, ఇన్విజిలేటర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, క్లర్క్, ఇతర సిబ్బంది రెమ్యునరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

COACHING CENTER

- Short term Coaching : I-CET, E-CET & EAPCET on (17/03/25), POLYCET & APRJC on (01/04/25). Surya Academy, Kota Jn., VZM. Ph : 99490 03295 [V- 6687]

SERVICES

- రుణాలు,వ్యక్తిగత,వ్యవసాయం,వ్యాపారం రుణం తక్కువ వడ్డీరేటు, సిబిల్ అవసరం లేదు, NPAవారు కూడా సలహాల కొరకు సంప్రదించండి. పార్తిబా, 9121625779. [T-314]

WANTED

- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25,000 నుండి 30,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95504 67459. [SCA 25002218]
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639663, 8977639662 [SCA25002130]
- కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135 [HA-134]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.